నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | సోమవారం 6 నవంబర్ 2023 www.ntnews.com

## దటీజ్ తెలంగాణ

2004 – 2014 వరకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల కోసం తెలంగాణకు రూ.5,558కోట్లు కేటాయించగా, కేసీఆర్ ప్రభుత్వం 2014–2023 వరకు రూ.58,696.34 కోట్లు కేటాయించింది. తెలంగాణ రాకముందు 29 లక్షల మంది లబ్ధిదారులుండగా, ప్రస్తుతం 44.82 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు.



సంక్షేమం

దళితుల సాధికారత కోసం.. వారికి తెలిసిన, నచ్చిన ఉపాధి మార్గాన్ని ఎంచుకొని.. గౌరవంగా జీవించడానికి.. ఎలాంటి షరతులు, బ్యాంకు లింకేజీ లేకుండా ఏకమొత్తంగా రూ.10 లక్షల నగదును అందించే పథకానికి కేసీఆర్ సర్కారు శ్రీకారం చుట్టింది. అదే 'దళిత బంధు'.

దళిత బంధు

పథకం ప్రారంభం **2021**
లబ్ధిదారుల సంఖ్య **38,511**
అందిన సాయం **3,851** కోట్లు

## కారు చీకట్ల నుంచి కాంతిరేఖలు

| 2014కు ముందు తెలంగాణలో | ప్రస్తుతం మన రాష్ట్రంలో.. |
|---|---|
| విద్యుత్తు స్థాపిత సామర్థ్యం 7,778 మెగావాట్లు | విద్యుత్తు స్థాపిత సామర్థ్యం 18,756 మెగావాట్లు |
| గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 5,661 మెగావాట్లు | గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 15,497 మెగావాట్లు |
| గరిష్ఠ విద్యుత్తు వినియోగం 128 మిలియన్ యూనిట్లు | గరిష్ఠ విద్యుత్తు వినియోగం 297.89 మిలియన్ యూనిట్లు |
| గృహ, వాణిజ్య రంగాలకు విద్యుత్తు కోతలు 4-8 గంటలు | గృహ, వాణిజ్య రంగాలకు కరెంటు సరఫరా 24 గంటలు |
| పరిశ్రమలకు వారానికి పవర్ హాలిడేలు 2 | పారిశ్రామిక రంగానికి కరెంటు సరఫరా–24 గంటలు |
| వ్యవసాయానికి కరెంటు సరఫరా 4-6 గంటలు | వ్యవసాయరంగానికి కరెంటు 24 గంటలు |
| వ్యవసాయ కనెక్షన్లు 19.03 లక్షలు, మొత్తం విద్యుత్తు కనెక్షన్లు 1.11 కోట్లు | వ్యవసాయ కనెక్షన్లు 27.63 లక్షలు, మొత్తం విద్యుత్తు కనెక్షన్లు 1.79 కోట్లు |
| తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్లు | తలసరి విద్యుత్తు వినియోగం 2,126 యూనిట్లు (దేశం కంటే 73శాతం ఎక్కువ |

2023–24 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తు సబ్సిడీలకు కేటాయించిన మొత్తం: రూ. **11,500** కోట్లు | ట్రాన్స్‌మిషన్, డిస్కం బలోపేతానికి ఖర్చు: రూ. **40** వేల కోట్లు

### దేశం, ఇతర రాష్ట్రాల్లో

| దేశంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం | దేశంలో తలసరి విద్యుత్తు వినియోగం | దేశవ్యాప్తంగా విద్యుత్తు కొరత |
|---|---|---|
| 4,16,059.47 మెగావాట్లు | 1255 యూనిట్లు | 3000 మెగావాట్లు |

విద్యుత్తు కొరత తీవ్రంగా ఉన్న రాష్ట్రాలు: 6
(హర్యానా, రాజస్థాన్, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్)

| | పరిశ్రమలు | వ్యవసాయం |
|---|---|---|
| గుజరాత్‌లో కరెంటు సరఫరా | 18 గంటలు | 8 గంటలు |
| మధ్యప్రదేశ్‌లో కరెంటు సరఫరా | 8 గంటలు | 7 గంటలు |
| రాజస్థాన్‌లో కరెంటు సరఫరా | 12 గంటలు | 7 గంటలు |
| కర్ణాటకలో కరెంటు సరఫరా | 8 గంటలు | 7 గంటలు |

**2014 తర్వాత స్వరాష్ట్రంలో..**
విద్యుత్తు స్థాపిత సామర్థ్యం **18,756** మెగావాట్లు

## వాహ్! క్యా సీన్ హై!!

# ఫేస్ రైట్ టర్నింగిచ్చుకో!



రాబోయే రోజుల్లో తెలంగాణకు కాబోయే సీఎం అని చెప్పుకొనే ఈయన సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి. మూడుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన నియోజకవర్గానికి ఒరగబెట్టిందేం లేదు! తాజా ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా పదనిసలే ఎదురవుతున్నాయి. ఓటర్ల కటాక్షం కోసం ఏ గల్లీలో తిరిగినా బీఆర్ఎస్ సంక్షేమ పథకాన్ని పొందిన వాళ్లే ఎదురవుతుండటంతో కంగుతింటున్నారు. నిన్నటికి నిన్న ప్రచార జోష్‌లో ఉన్న జగ్గన్న తాను ఎక్కడున్నదీ మర్చిపోయారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన సంగారెడ్డి వైద్య కళాశాల ముందు తీన్మార్ డ్యాన్స్ ఫోజిచ్చారు. ఆయన రోడ్‌షోకు హాజరైన వాళ్లు ప్రభుత్వం చేసిన ప్రగతి ముందు ప్రత్యర్థి ప్రచారం చూసి విస్తుపోయారు. 'ఓ జగ్గన్న కాస్త రైట్ టర్నింగిచ్చుకో!' అని తమలో తాము చర్చించుకున్నారు.




ఒకనాడు వారి కాల్షీట్ల కోసం బడాబడా నిర్మాతలే వెంపర్లాడారు. 'ఒక్క చాన్స్' మేడం అంటూ పెద్దపెద్ద ప్రొడక్షన్ హౌస్‌లే వారి వెంటపడ్డాయి. 'ఒక నెల రోజుల డేట్స్ ఇవ్వండి మేడం' అని వారిని ఎంతో మంది ప్రాధేయపడ్డారు. ఆనాడు వారి ఫేమ్‌ను వాడుకొని కాసులు కురిపించుకోవాలని ఎంతో మంది చూశారు. కానీ నేడు.. పరిస్థితి తలకిందులైంది. 'పూర్తి కాల్షీట్లు ప్రజా సేవకే కేటాయించాం.. డేట్స్ అన్నీ పార్టీకే ఇచ్చాం.. నెల రోజులేం ఖర్మ.. ఏడాదంతా పార్టీ కోసమే పని చేశాం.. ఒక్క టికెట్ ప్లీజ్' అంటూ ప్రాధేయపడాల్సిన పరిస్థితి వచ్చింది. వారే అలనాటి తారలు జయసుధ, జీవిత, రాములమ్మ అలియాస్ విజయశాంతి.



# కాల్షీట్లు ఇచ్చినా.. టికెట్లు ఇవ్వలే

అలనాటి తారల చెవిలో కమలం పువ్వు

### టికెట్ ఆశించి భంగపడ్డ నాయికలు.. పార్టీలో రాములమ్మకు తగ్గిన ప్రాధాన్యం

### జయసుధ, జీవితకు నో టికెట్.. పార్టీ మారే యోచనలో నటీమణులు

అలనాటి అగ్రతారల చెవుల్లో బీజేపీ 'కమలం' పువ్వు పెట్టింది. టికెట్ ఆశించిన నాయికలకు కమలం పార్టీ మొండిచెయ్యి చూపించింది. అధ్యక్షా..అనే పిలుపు కోసం ఆశపడ్డ అలనాటి హీరోయిన్లకు బీజేపీ నిరాశే మిగిల్చింది. ఎమ్మెల్యే టికెట్ హామీ ఇచ్చి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ ఆ సీనియర్ నటీమణులకు హ్యాండిచ్చింది. కమలం నుంచి పోటీ చేయాలని కలలుగన్న హీరోయిన్లలో ఒకరు మాజీ ఎమ్మెల్యే జయసుధ అయితే, మరొక నటి జీవితారాజశేఖర్. వీరిద్దరూ గ్రేటర్‌లోని పలు నియోజకవర్గాల నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 'సినిమాల్లో వచ్చిన చాన్స్ వచ్చినట్టే వచ్చి చేజారడం' గురించి తెలిసినవారు కాబట్టే.. ముందు జాగ్రత్తగా ఒకటికి మించి నియోజకవర్గాలకు దరఖాస్తు చేసుకున్నారు. నాలుగైదు నియోజకవర్గాలపై కర్చీఫ్ వేశారు. అంతలా జాగ్రత్త పడ్డా వారికి నిరాశే ఎదురైంది. కాషాయ పార్టీ విడుదల చేసిన మూడు జాబితాల్లోనూ వారి పేర్లు లేకపోవడం గమనార్హం. దీంతో అగ్ర తారలు నిరాశకు గురైనట్టు తెలుస్తున్నది.

> మొదటి జాబితాలోనే తమ పేర్లు ఉంటాయని వారు ఆశించారు. కానీ అలా జరగకపోవడంతో అప్పటి నుంచే వారిద్దరూ పార్టీకి, రాష్ట్ర నాయకత్వానికి దూరంగా ఉంటున్నట్టు సమాచారం.

టికెట్ ఆశించి భంగపడ్డ వారిద్దరూ పార్టీ కార్యకలాపాల్లోనూ కనిపించడం లేదు. రెండో, మూడో జాబితాలోనైనా స్థానం దక్కుతుందని ఆశించినా.. భంగపాటే ఎదురవడంతో పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ సీనియర్ నాయకురాలు రాములమ్మది మరో కథ. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్నా.. ఆమె అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పార్టీలో ప్రాధాన్యం తగ్గడంతో ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ అమాంతంగా పడిపోవడంతో పోటీ చేసినా ప్రయోజనం ఉండదని ఆమె భావిస్తున్నట్టు సమాచారం.

### రెండు, మూడు చోట్ల కర్చీఫ్

ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎప్పట్నుంచో ఆశగా ఉన్న హీరోయిన్ జీవిత.. కాషాయం పార్టీ నుంచి జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఏ స్థానమూ ఆమెకు దక్కలేదు. కూకట్‌పల్లి సీటు ఇంకా ప్రకటించకపోయినప్పటికీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. దీంతో ఆమె కూకట్‌పల్లిపై కూడా ఆశలు వదులుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జయసుధ సికింద్రాబాద్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ అగ్రనాయకత్వం జయసుధ సికింద్రాబాద్ నుంచి బరిలో ఉంటారని సంకేతాలివ్వడంతో ఆమె స్థానికులతోనూ సమావేశమయ్యారు. కానీ చివరకు ఆమెకు బీజేపీ షాకిచ్చిందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

**కాషాయంపై మహిళల ఆగ్రహం**

బీజేపీపై మహిళా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాషాయం పార్టీలో తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. సికింద్రాబాద్ సీటును మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండ కార్తీకారెడ్డి కూడా ఆశించారు. ఆమె సహా మరో నలుగురు మహిళలు కూడా దరఖాస్తు చేసుకున్నారు. జూబ్లీహిల్స్ సీటు కోసం పద్మ, కీర్తి, జీవితారాజశేఖర్ పోటీ పడగా.. వారిని కాదని దీపక్ రెడ్డికి కట్టబెట్టారు. అంబర్‌పేట్ టికెట్ ఆశించిన మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తికి కూడా నిరాశే ఎదురైంది. సనత్‌నగర్ సీటును ఆకుల విజయ కోరగా ఆమెకు నిరాశే మిగిలింది. దీంతో మహిళలకు బీజేపీ అన్యాయం చేసిందని విమర్శలు వస్తున్నాయి. టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా పార్టీ మారే యోచనలో ఉన్నట్టు సమాచారం.

- హైదరాబాద్, సిటీబ్యూరో

## సోషల్ యాంగిల్

### జెట్ స్పీడ్ జంపింగ్



ఎన్ని పార్టీలు మారిండో?
లెక్క పెట్టేసరికే...
మళ్లీ ఇంకో పార్టీ
మారేటట్టు ఉన్నడు
జెట్ స్పీడ్ జంపింగ్

- అనిల్ కూర్మాచలం

## షహర్ కీ బాత్

### నగరంలో కర్ఫ్యూకు చెక్

గతంలో చిన్న చిన్న గొడవలైనా హైదరాబాద్ నగరంలో దుకాణాలు మూయాల్సి వచ్చేది. గత ప్రభుత్వాలు శాంతిభద్రతలను అదుపు చేయడంలో విఫలమయ్యాయి. ఉమ్మడి పాలకులు ప్రజలు, వ్యాపారుల శ్రేయస్సును పట్టించుకున్న పాపాన పోలేదు. నగరంలో వ్యాపారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించింది తెలంగాణ ప్రభుత్వమే. ప్రత్యేక రాష్ట్రంలో హింసాయుత పరిస్థితులకు చెక్ పెట్టారు. ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తున్నది. అన్నివర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవించేందుకు అనుకూల నగరంగా మారింది. ఇది ముమ్మాటికీ కేసీఆర్ సర్కార్ ఘనతే. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోనే స్వర్ణాభరణాల వ్యాపారానికి హైదరాబాద్ పేరుగాంచింది. దుకాణదారులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరాది వ్యాపారులంతా బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. కారు గుర్తుకే ఓటేస్తాం.



-గులాబ్‌సింగ్, బంగారం వర్తకుడు



డబుల్ బెడ్రూం ఇంటిముందు పెద్దగంట లక్ష్మి, పక్కన కొడుకు పరశురాములు

# నీడనిచ్చి.. బతుకునిచ్చిండు

### తిన్న రేవును తల్సుకోవాలె.. కేసీఆర్ సారును మల్లా గెలిపించాలె

'సారును ఇడిశేది లేదు.. పదేండ్ల కిందటి లెక్క మల్ల సావుమర్నం అయ్యేది లేదు. పేదోల్లకు కూడు, గూడు.. సకులం సగవెడుతున్నది దేవుడసొంటి ఆ అయ్యనే. పేగు బంధమోలె మమ్మల్ని కాపాడుకుంట మా ఆయుష్షు పెంచుతాండు. మల్లా మల్లా సారునే గెలిపించుకుంటం' అంటున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లికి చెందిన ఏడుపదుల అవ్వ పెద్దగంట లక్ష్మి. పెనిమిటి కాలం జేస్తే.. ఆసరా పింఛన్లతోని దివ్యాంగుడైన కొడుకుని సాదుకుంటున్న లక్ష్మి తన మనోగతాన్ని 'నమస్తే'తో పంచుకున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే...

నా పెనిమిటి పెద్దగంట బాలయ్య గౌడ్ గీత కార్మికుడు. బతికినంత కాలం కుల వృత్తినే నమ్ముకున్నడు. ఇంటికి ఏ లోటూ రాకుండ జూసుకునేటోడు. మాకు ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు వెంకట్‌గౌడ్ హైదరాబాద్‌లో పని జేస్తడు. దివ్యాంగుడైన పెద్ద కొడుకు గురించే ఎప్పుడూ నా పెనిమిటి రంది పడేటోడు. ఒంట్లో బాగాలేక 2015లో నా పెనిమిటి కాలం జేశిండు. అప్పటిసంది మాకు కష్టాలు మొదలైనయి. తిండికి కష్టమయ్యేది. కేసీఆర్ సారు ఇచ్చే పింఛినీ పైసలతోని తిండిగింజలు కొని బతుకుతున్నం. దివ్యాంగుడైన కొడుకుని సాదుకుంట కిరాయి ఇంట్ల బిక్కుబిక్కుమని బతుకుతుండె. నెలంతా మంచిగ ఉన్నా.. ఒకటో తారీఖు వస్తే గుబులు అయ్యేది. ఇంటి కిరాయి తల్సుకుంటే వణుకు పుట్టేది. వయోభారంతో కదల్లేకున్న నన్ను, దివ్యాంగుడైన నా కొడుకు దీనస్థితిని చూసి మానవీయ ప్రభుత్వం చలించింది. అగ్గిపెట్టె లాంటి అర్రలల్ల మా అసంటోళ్లు నలిగిపోవుడు సూడలేక.. కేసీఆర్ సారు డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిచ్చిండు. పేదోళ్లను పెద్దింటోళ్లుగా చేస్తనన్న సారు.. చేసి చూపెట్టిండు. గొల్లపల్లి–ఎల్లారెడ్డిపేట దారిపొంటి కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లల్ల ఒక ఇల్లు ఇచ్చి మాకు నీడ కల్పించిండు.

### సారు సల్లంగుండాలె..


అయ్య(కేసీఆర్ సారు) ఇల్లు ఇచ్చిండు.. ఇంటినీ నడిపిస్తున్నడు. ఇప్పుడు సొంత ఇంట్ల నిమ్మలంగ ఉంటున్నం. నాకు రూ.2016, నా కొడుక్కి రూ.4016 పింఛను ఇస్తుండ్రు. రేషన్ బియ్యంతో అల్కగ బతుకుతున్నం. ఎవ్వలమైన తిన్న రేవు తల్వాలె. అప్పుడే ఇంత అన్నం పుడుతది. అయ్యలు (కేసీఆర్, కేటీఆర్) లేకుంటె ఈపాటికి మట్టిల గలిశి, పేరు మాశెటోళ్లం. సన్న బియ్యం, మంచి వైద్యం, బీమా, నా అసొంటోళ్లకు 5 వేల దాకా, నా కొడుకు అసొంటోళ్లకు రూ.6 వేల దాక పింఛినీ పెంచుతరంట. ఆ అయ్యలు సల్లంగుండాలె. ఈ తాప గుడ్క అయ్య సర్కారె వస్తది. (ఈ మాటలు చెబుతుంటే కేసీఆర్ సర్కారు మీద పేగు బంధానికి మించిన భావోద్వేగం పెద్దమ్మ కండ్లల్లో కనిపించింది.)

... ఇల్లెందుల దుర్గాప్రసాద్

# పానిపట్టు లేదిక.. పానీ పట్టుకోవడమే

### 708.54 కోట్లతో మల్కాజిగిరిలో తాగునీటి సరఫరా • ఇంటింటికీ నల్లా కనెక్షన్.. తీరిన ప్రజల తాగునీటి గోస

ఒకప్పుడు మల్కాజిగిరి అంటే 'పానీ'పట్టు యుద్ధాలకు ప్రసిద్ధి. ఎక్కడ చూసినా బిందెలతో కొట్లాటలే. ఏ గల్లీకి పోయినా సిగపట్లే. మిషన్ భగీరథతో మల్కాజిగిరి 'పానీ'పట్టు యుద్ధానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చెక్ పెట్టారు. ప్రజల దాహార్తిని తీర్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. రూ.708.54 కోట్లతో అనుకున్న సమయం కంటే ముందే ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లు ఇచ్చి అపర భగీరథుడిగా కీర్తిని పొందారు. ప్రజలకు మెరుగైన నీటి సరఫరా కోసం గౌతమ్‌నగర్ డివిజన్‌లో రూ.10 కోట్లతో రిజర్వాయర్‌ను నిర్మిస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ ఇస్తున్నారు.




ఫీల్డ్ వ్యూ: మల్కాజిగిరి

2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి మల్కాజిగిరి నియోజకవర్గంగా ఏర్పడింది. గత పాలకులు నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో తాగునీటి కష్టాలు చాలా ఎక్కువగా ఉండేవి. బస్తీలు, కాలనీల్లో నీటి కోసం 'పానీ'పట్టు యుద్ధాలు జరిగేవి. ఖాళీ బిందెలతో జనం ధర్నాలు.. రాస్తారోకోలు చేసేవారు. తాగునీటి ట్యాంకర్ ఎప్పుడు వస్తుందా? అని దినసరి కూలీలు ఇంటి వద్దనే ఉండేవారు.

### ప్రజల దూప తీర్చిన అపర భగీరథుడు

ప్రజల కష్టాలు తీరాలంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావాల్సిందేనని అప్పట్లోనే కేసీఆర్ స్పష్టం చేశారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇస్తాం.. అక్కాచెల్లెళ్లు బిందెలు పట్టుకుని తిరగాల్సిన అవసరం లేదని..



తాగునీటి గోస తీరుస్తామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం.. మల్కాజిగిరి సర్కిల్‌లో రూ.338.54 కోట్లు, అల్వాల్ సర్కిల్‌లో రూ.190 కోట్లతో పనులు చేపట్టారు. వీటితో పాటు మరో రూ.180 కోట్లు కలిపి మొత్తం రూ.708.54 కోట్లతో ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లు ఇచ్చారు.

### మౌలాలి కమాన్ విస్తరణకు నిధులు

మల్కాజిగిరికి ఐకాన్‌గా ఉన్న చారిత్రాత్మక కట్టడం మౌలాలి కమాన్‌ను ప్రభుత్వం పునరుద్ధరించింది. వాహనాలు ఢీకొనడంతో ధ్వంసమైన ఈ కమాన్ పునరుద్ధరణకు మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కమాన్ విస్తరణ కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసి పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారాన్ని చెల్లించింది.

### మల్కాజిగిరి సర్కిల్‌లో..

- ఫీడరు ప్రధాన లైన్లు: **8.09** కి.మీ.
- మొత్తం పంపిణీ వ్యవస్థ: **380** కి.మీ.
- పంపుహౌస్‌లు: **5** (సైనిక్‌పురి, మౌలాలి, వాజ్‌పేయినగర్, సాయినాథపురం, గౌతమ్ నగర్, జేఎల్ఎన్ఎస్ నగర్, డిఫెన్స్ కాలనీ).
- మొత్తం నల్లా కనెక్షన్లు: **78,000**
- ఉచిత తాగునీటి పథకం లబ్ధిదారులు: **54,000**
- పవర్ బోర్లు: **250**

### అల్వాల్ సర్కిల్‌లో..

- ఫీడరు లైన్లు: **6.2** కి.మీ.
- మొత్తం పంపిణీ వ్యవస్థ : **290** కి.మీ.
- పంపు హౌస్‌లు: **2** (లోతుకుంట, బాలయ్యనగర్)
- రిజర్వాయర్లు : **3** (మంగపురం కాలనీ)
- మొత్తం నల్లా కనెక్షన్లు : **27,006**
- ఉచిత తాగునీటి పథకం లబ్ధిదారులు: **15,052**